క్లుప్తంగా

కులగణన నిర్ణయంపై హర్షం

చేబ్రోలు: రాష్ట్రంలో కులాల వారీగా అధికారిక సర్వే చేయటానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ బీసీ నాయకులు, డీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు తదితరులు ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. నవంబర్ 15వ తేదీ నుంచి చేపట్టే కుల గణన ద్వారా ఇంటింటి వివరాలను ఉద్యోగులు, అధికారుల బృందం సేకరించటం ద్వారా పారదర్శక డేటా లభిస్తుందన్నారు. దీర్ఘకాలంగా కులగణన జరపాలంటూ బీసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయం పట్ల అభినందనలు తెలిపారు.

నేడు పెదకాకానిలో జగనన్న ఆరోగ్య సురక్ష

పెదకాకాని: ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం చేకూరాలనే ఆశయంతో ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యాక్రమం సోమవారం పెదకాకాని లూథర్‌గిరి ప్రాథమికోన్నత పాఠశాలలో జరుగుతుందని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి చెప్పారు. ఈ వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కోరారు. ఉచితంగా వైద్య పరీక్షలు, మందులు పంపిణీ, అలానే కంటి వైద్య పరీక్షలు కూడా చేయడం జరుగుతుందని తెలియజేశారు.

ఆకట్టుకున్న శ్రీ కృష్ణరాయబారం సీను

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో డాక్టర్ సీవీఎస్ రామకృష్ణ, అన్నపూర్ణ నిర్వహణలో ఆదివారం శ్రీ కృష్ణరాయబార పడక సీను ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ముఖ్య అతిథులుగా కె.ఎస్.వి. కృష్ణ, కె.శివ ప్రసాద్ పాల్గొన్నారు. శ్రీ కృష్ణుడిగా రామకృష్ణ, అర్జునుడిగా ఉల్లంగుల బ్రహ్మం, దుర్యోధనుడిగా షేక్ లాల్‌అహ్మద్ తదితర కళాకారులు వివిధ పాత్రలలో రక్తికట్టించారు. అనంతరం నిర్వహించిన సినీ సంగీత విభావరిలో గాయకులు పలు చిత్రాల్లోని పాటలను ఆలపించి అలరించారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. శావల్యాపురం మండలం కారుమంచి గ్రామానికి చెందిన రావూరి సాయికుమార్(28) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. ఈనెల 10వ తేదీ గుంటూరు అమరావతి రోడ్డులోని ఓ లాడ్జిలో రూము అద్దెకు తీసుకున్నాడు. రెండురోజులుగా రూము తలుపులు తెరవలేదు. అనుమానం వచ్చిన లాడ్జి సిబ్బంది ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు రూము తలుపులు బలవంతంగా తెరవగా సాయికుమార్ పురుగులు మందు తాగి మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని మార్చురికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో..

వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటనపై లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. ముక్తి వీధికి చెందిన షేక్ యాసిన్(23)కు అదే ప్రాంతానికి చెందిన జబీనాకు 4 నెలల క్రితం వివాహం అయింది. జబీనా గర్భిణి కావడంతో పుట్టింటికి వెళ్లింది. యాసిన్ మూడు రోజులుగా అస్వస్తతకు గురయ్యాడు. మానసికంగా కుంగి పోయి ఆదివారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

పురుగుమందు తాగి..

తాడికొండ: కుటుంబ కలహాల నేపథ్యంలో వ్యక్తి ఆత్మహత్య చేసుకొని మరణించిన ఘటన తాడికొండ మండలం మోతడక గ్రామంలో జరిగింది. వివరాల ప్రకారం బాపనపల్లి రాంబాబు (46) వ్యవసాయ కూలీగా పనిచేస్తుంటాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో శనివారం రాత్రి వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో మనస్తాపం చెందిన మృతుడు పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి బాధితుడు బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగార్జున తెలిపారు.

మహిళ అదృశ్యం

గుంటూరు ఈస్ట్: మహిళ అదృశ్యంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. శ్రీనివాసరావుపేటకు చెందిన 62 సంవత్సరాల నాగిరెడ్డి వెంకటరమణ ఈ నెల 12వ తేదీ ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదుచేశారు.

వృద్ధ మహిళపై దాడి కేసులో నిందితుడు అరెస్ట్

మేడికొండూరు: వృద్ధ మహిళ దాడి కేసులో ఘటనకు సంబంధించి నిందితుడిని మేడికొండూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈనెల 10వ తేదీన మండల పరిధిలోని భీమినేనివారిపాలెం గ్రామంలోని హైమావతి అనే వృద్ధ మహిళపై దాడి చేసి ఇంట్లో ఉన్న నగదును కొందరు దుండగులు దోచుకెళ్లారు. దీనిపై మేడికొండూరు పోలీసులు దృష్టి సారించి నిందితుడిని ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు...పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చెందిన ఒకరిని గుంటూరు శారదాకాలనీలో ఉండగా మేడికొండూరు పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. గుండ్లపాలెం గ్రామ శివారులోని పెట్రోలు బంకులో ఉన్న సీసీ కెమె రా ల ఫుటేజ్ ఆధారంగా నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలియవస్తోంది. ఈ ఘటనలో ఇద్దరు దాడిలో పాల్గొన్నట్లు, రెండో నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నట్లు తెలిసింది.

కనుల పండువగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



నల్లపాడు అగస్తేశ్వరాలయంలో బాలాత్రిపుర సుందరీ దేవి అలంకారంలో అమ్మవారు



గోరంట్ల వెంకటేశ్వరాలయంలో బతుకమ్మ సంబరాలు చేస్తున్న భక్తులు

గుంటూరు రూరల్: దసరా ఉత్సవాల్లో భాగంగా శరన్నవరాత్రి ప్రత్యేక పూజలను వాడవాడలా భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఆదివారం మొదటి రోజు నల్లపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీ అగస్తేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు బాలాత్రిపురసుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సామూహిక కుంకుమార్చన, సప్తహారతులు నీరాజన మహామంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించారు.

గోరంట్ల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో...

గోరంట్ల గ్రామం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి బాలాత్రిపురసుందరీ దేవి అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఆలయం ప్రాంగణంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గజవల్లి వెంకటప్పారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తుల కోర్కెలు తీర్చే దేవత కనకదుర్గమ్మ



ప్రత్యేక పూజల్లో పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తదితరులు

గుంటూరు రూరల్: భక్తుల కోర్కెలు తీర్చే దేవత కనకదుర్గమ్మ అని పెదకూరపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తెలిపారు. ఆదివారం దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చిన్నపలకలూరు గ్రామంలోని పోలేరమ్మ తల్లి ఆలయంలో ఏర్పాటు చేసిన నవరాత్రి ఉత్సవాలలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేసి అమ్మవారిని దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పించి నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు, మిర్చియార్డు డైరెక్టర్ బొందలపాటి వెంకటేశ్వరరావు(ఇంద్ర) ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలను నిర్వహించడం సంతోషకరమని అభినందించారు. కార్యక్రమంలో గ్రామంలోని భక్తులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అవయవ దానంపై చైతన్యం తీసుకురావాలి



అవయవ దానం కరపత్రాలతో సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ తదితరులు

నగరంపాలెం: అవయవ దానంపై ప్రజల్లో మరింతగా చైతన్యం రావాల్సిన అవసరం ఉందని జీజీహెచ్ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ అన్నారు. జీజీహెచ్‌లో ఆదివారం సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్, చారిటబుల్ ట్రస్ట్ అఖిల భారత శరీర, అవయవ దాతల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్ష, వైద్యులు ఎస్ఎస్‌వీ రమణ అధ్యక్షత వహించారు. సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆస్పత్రిలో అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు కృతనిశ్చయంతో ఉందని అన్నారు. ఈ క్రమంలోనే లివర్, కిడ్నీ, గుండె మార్పిడి చేసేందుకు గుంటూరు జీజీహెచ్‌ను గుర్తించిందని చెప్పారు. దీనికై అవసరమైన అనుమతులు జారీ చేసిందని పేర్కొన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని ఆరోగ్యశ్రీ ద్వారా అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందిస్తున్నారని అన్నారు. త్వరలో అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. పార్థివదేహాలను అవయవ దానం చేసిన దాతలను, మెడికల్ కళాశాలలకు దానం చేసే దాతలను రాష్ట్ర ప్రభుత్వం గౌరవ మర్యాదలతో ప్రోత్సహిస్తోందని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో వైద్య రంగాన్ని మరింతగా బలోపేతం చేస్తున్నారని అన్నారు. అవయవ దానం చేసేందుకు ముందుకొచ్చిన 20 మంది దాతలను అభినందించారు. కార్యక్రమంలో అనటామి విభాగాధిపతి సావిత్రి, స్పెక్ట్ చైర్‌పర్సన్ జి.సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

చెరువులను సాగర్‌నీటితో నింపుకోవాలి



రేపూడి చెరువును పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లోని చెరువులను నాగార్జున సాగర్ నీటితో నింపుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు చెప్పారు. గుండాలపాడు, రేపూడి రక్షితమంచినీటి చెరువు, కండ్రిక, నుదురుపాడు గ్రామాల్లోని చెరువులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి అవసరాల నిమిత్తం సాగర్ నీరు రెండురోజుల కిందట విడుదల చేశారన్నారు. వాటితో ఫిరంగిపురం, నుదురుపాడు, రేపూడి, శిరంగిపాలెం, 113 త్యాళ్లూరు, మునగపాడు, గుండాలపాడు, బేతపూడి, కండ్రిక, యర్రగుంట్లపాడు గ్రామాల్లోని చెరువులను సాగర్‌నీటితో నింపుకోవాలని పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులకు తెలియజేసినట్లు తెలిపారు. గుండాలపాడు గ్రామంలోని చెరువును శుభ్రం చేశారని, సోమవారం చిరుమామిళ్ల మేజర్‌ద్వారా నీరు వస్తుందని చెప్పారు. అదేవిధంగా కొండవీటి మేజర్‌ద్వారా వేపూడి రక్షిత మంచినీటి చెరువును నింపుతున్నామన్నారు. ఆయన వెంట వర్క్ ఇన్స్‌పెక్టర్ సాయి, పలుగ్రామాల సర్పంచులు ఉన్నారు.

అడివి బాపిరాజు కవిత్వంలో ప్రకృతి వర్ణనలు

పాత గుంటూరు: అడివి బాపిరాజు కవిత్వంలో ప్రకృతి వర్ణనలు ప్రత్యేకం అని, అందులో ప్రపంచ ప్రయోజనం కనిపిస్తోందని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం బ్రాడీపేట ఎస్‌హెచ్‌ఓ సమావేశ మందిరంలో అమరావతి సాహితీ మిత్రులు నిర్వహించిన సభకు యర్రగుంట్ల పాణీరావు అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ గొప్ప నవల రచయితగా, చిత్రసీమలో గొప్ప కళా దర్శకులుగా విభిన్న రీతులలో అడివి బాపిరాజు కవిత్వం రమణీయంగా రాశారని చెప్పారు. రైతులు, యానాదులు, రకరకాల పీడితుల గురించి ఆయన కవిత్వంలో వివరించారని వివరించారు. ఉమా మహేశ్వరరావు రచించిన 'సిపాయి కథలు' గురించి డాక్టర్ యలవర్తి భవాని వివరించారు. 'ఈ మాసం కవి'గా ప్రముఖ సినీ రచయిత కనగాల జయకుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో సంస్థ కన్వీనర్ పింగళి భాగ్యలక్ష్మీ నిర్వహించిన కవి సమ్మేళన కార్యక్రమంలో డాక్టర్ రామడుగు వెంకటేశ్వరశర్మ, ఇ.చంద్రయ్య, గడల శివప్రసాద్, వి.వి.రావు, బండికల్లు జమదగ్ని, సత్యవతి, మన్నం వెంకట గురువు పాల్గొన్నారు. అనంతరం కనగాల జయకుమార్‌ను డాక్టర్ రావి రంగారావు సత్కరించారు.

శాంతిమార్గం చూపిన దార్శనికుడు మొహమ్మద్ ప్రవక్త



రఫాని, దరియావలి,విడదల గోపీలను సత్కరిస్తున్న నిర్వాహకులు

చిలకలూరిపేట: మొహమ్మద్ ప్రవక్త(స) ఆచరించి చూపిన శాంతిమార్గం మానవులంతా ఆదర్శంగా తీసుకో వాలని హైదరాబాద్‌కు చెందిన మతగురువులు సయ్యద్ అహ్మద్‌గౌరీ సాహెబ్, సయ్యద్ సగీర్ అహ్మద్‌సాహెబ్‌లు చెప్పారు. పట్టణంలోని సుభాని నగర్‌లో ఆదివారం సున్నీ జమాత్ ఆధ్వర్యాన మిలాదున్నబీ ఇజ్‌తీమ ఆధ్యాత్మిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఖురాన్‌లోని అంశాలు, ప్రవక్త జీవిత విశేషాలను వారు వివరించారు. పీర్‌ముర్షిద్ ముక్తారుల్లాషా ఆమిరియా, సజ్జదా ముఫ్తి అబ్దుల్ కలీమా, మౌలానా హాఫీజ్ సాఖిబ్, సుల్తాన్, సాధిక సాహీన్, బాజీసాహెబ్, మునీర్, నగీన్‌సాహెబ్‌లు బయాన్ ప్రసంగం చేసిన వారిలో ఉన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమ నిర్వహణను జాకీర్‌హుస్సేన్, నాయక్ రసూల్, రియాజ్, గోల్డ్ సుభాని, జిలాని, సుభాని నగర్ యూత్ పర్యవేక్షించారు.

ఇదే వేదికపై..

కార్యక్రమానికి విచ్చేసిన మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు విడదల గోపీ, ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ దరియావలిను వేదికపై అభినందించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజిని ముస్లీం గోరస్తాన్ కోసం తమ సొంత నిధుల్ని రూ.కోటి అందించారని, అలాగే మద్దినగర్, సుభాని నగర్‌లోని ఖబరస్తాన్ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించారని తెలిపారు. సుభాని నగర్‌లోని ఖబరస్థాన్ చుట్టూ ప్రహరీ నిర్మాణం పూర్తయిందని, త్వరలోనే కల్వర్టు, రోడ్డు పనులతో పాటు హైవే పక్కన ఉర్దూ స్కూల్ నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ముస్లింలకు అన్నీ విధాలా అండగా ఉంటామని తెలిపారు. అభివృద్ధి పనులు చేసినందుకు ముస్లింల తరుపున వారిని శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు.

విద్యార్థికి ఆర్థిక సాయం



ఫరూక్‌కు రూ.25 వేలు అందజేస్తున్న దృశ్యం

నెహ్రూనగర్: పేద విద్యార్థికి స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రభుత్వ విప్, లేళ్ల అప్పిరెడ్డి చేయూత అందించారు. స్ఫూర్తి ఫౌండేషన్ ద్వారా రూ.25 వేలు సాయం అందించారు. గుంటూరు నగరంలోని సంజీవయ్యనగర్‌కు చెందిన ఉమర్ ఫరూక్ ఇంటర్ పూర్తి చేశాడు. ఎంసెట్‌లో వచ్చిన ర్యాంకు కౌన్సెలింగ్‌లో వీవీఐటీలో మెకానికల్‌లో సీటు సంపాదించాడు. ప్రభుత్వ ఫీజు రీయింబర్స్‌మెంట్ పోను సదరు కళాశాల నియమ నిబంధనల ప్రకారం అతను ఇంకా కొంత మొత్తం కట్టాల్సి వచ్చింది. తొలుత దానికి సిద్ధపడి అతను కళాశాలలో చేరాడు. ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకున్న ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఉమర్ ఫరూక్‌ను పిలిపించి అతడికి అండగా నిలవడమే కాక అతనిలో మనోధైర్యం నింపి బతుకు పట్ల భరోసా పెంచారు. ఈ మేరకు లేళ్ల అప్పిరెడ్డి తరపున స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి, గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్ ఉమర్ ఫరూక్‌కు రూ.25 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, నేతలు ఆలా కిరణ్, అశోక్ పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు పంపిణీ

మంగళగిరి: అంజుమన్ ఇ హిమాయతుల్ ఇస్లాం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపకారవేతనాలు పంపిణీ చేయడం ద్వారా ముస్లిం మైనార్టీలలోని పేదలకు విద్యను అందించి ప్రోత్సహించడం అభినందనీయమని ఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఫరూక్ షబ్లీ కొనియాడారు. నగరంలో అంజుమన్ షాదీఖానాలో ఆదివారం అంజుమన్ ఇ హిమాయతుల్ ఇస్లాం ఆధ్వర్యంలో 669 మంది విద్యార్థులకు ఉపకారవేతనాలు అందించారు. అంజుమన్ అధ్యక్షుడు షేక్ అక్రమ్, టీడీపీ నాయకుడు పోతినేని శ్రీనివాసరావు, అంజుమన్ ప్రతినిధులు హనీఫా షా, షేక్ అల్తాఫ్, షేక్ రియాజ్, మహమ్మద్ ఇసూబ్ సాహెబ్, మహమ్మద్ రఫీ, షేక్ రషీద్ సాహెబ్, హనీఫ్ షా ఖాదిరి, అంజుమన్ ట్రస్ట్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

తాడికొండ: రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసిన ఘటన తాడికొండ మండలం కంతేరు గ్రామంలో జరిగింది. వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గుండాల రవితేజ అనే వ్యక్తి 4 బస్తాల రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగార్జున తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ సామగ్రి చోరీ

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామంలో పొలాల్లో ఏర్పాటు చేసిన 16 కె.వి. సామర్థ్యం కల్గిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పగలికొట్టి అందులో కాపర్, రాగి తీగ చోరీ చేసిన సంఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు గ్రామంలోని నుంచి పరిటాలవారిపాలెం వెళ్లే రహదారి మార్గంలో పాలుట్ల పవన్ కుమార్‌కు చెందిన సాగు భూమిలో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకున్నారు. ఈక్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ పగలికొట్టి అందులోని విలువైన సామగ్రిని చోరీ చేశారు. రూ. 2 లక్షల విలువ చేయు ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలికొట్టి అందులో విలువైన విద్యుత్ సామాగ్రి చోరీ చేసినట్లు విద్యుత్ ఏఈ సంపెంగుల గాంధీ వెల్లడించారు.

ఆకట్టుకున్న ఎక్స్‌పో-2023



ప్రదర్శనలో వివిధ రకాల ఉత్పత్తులు

తెనాలి: పట్టణానికి చెందిన రెయిన్‌బో ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎన్జీఓ కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన ఎక్స్‌పో-2023ను రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి అధ్యక్షుడు పావులూరి రాంబాబు ప్రారంభించారు. ఎక్స్‌పోలో తెనాలి, గుంటూరుకు చెందిన మహిళా ఎంటర్‌ప్రెన్యూర్లు వివిధ రకాల ఉత్పత్తులను ప్రదర్శించారు. వీటిలో వెండి, వన్ గ్రామ్, ఫ్యాషన్ ఆభరణాలు, ఆర్గానిక్ ఉత్పత్తులు, చీరలు, డ్రెస్ మెటీరియల్స్, డిష్ వాష్ ఉత్పత్తులు ఉన్నాయి. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.జీవనలత, అసిస్టెంట్ గవర్నర్ కన్నెగంటి మురళీకృష్ణ, కళ్యాణి, వరలక్ష్మి, గాయత్రి, జ్యోతి, అంజుమ్, సృజన పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయం



అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నాయకులు



అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నాయకులు

మంగళగిరి: భారత మాజీ రాష్ట్రపతి, ప్రసిద్ధ శాస్త్రవేత్త డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలు చిరస్మరనీయమని వైఎస్సార్ సీపీ నాయకులు కొనియాడారు. ఆదివారం అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని నగర పరిధిలోని నవులూరు మక్కెవారిపేటలో కల అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాల లు వేసి నివాళులర్పించిన నాయకులు ఆయన సేవలను కొనియాడారు. నాయకులు ఈపూరి ఆదా మ్, దొడ్డక కృష్ణ, షేక్ షఫీ, పులి రామారావు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో...

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): భారతదేశం గర్వించదగ్గ శాస్త్రవేత్త, మాజీ రాష్ట్రపతి, భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని ఆదివారం దుగ్గిరాల గ్రామంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని, మైనార్టీ నాయకుడు అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సుభాని మాట్లాడుతూ సాధారణ పేపర్‌బాయ్ స్థాయి నుంచి మిసైల్ మ్యాన్‌గా, రాష్ట్రపతిగా ఉన్నత శిఖరాలను అధిరోహించి దేశ అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన అబ్దుల్ కలాం చిరస్మరణీయులని అన్నారు. భారతదేశపు అత్యున్నత పౌర పురస్కారమైన భారత రత్నతో పాటు అనేక ప్రతిష్టాత్మక అవార్డులను అందుకున్నారని, ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శమని, భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయమని అన్నారు. షేక్ రషీద్ సాహెబ్, షేక్ జాను, షేక్ జాన్ సైదా, పఠాన్ ఖాదర్, పఠాన్ మస్తాన్, సయ్యద్ జానీ, కాకా వెంకటేశ్వర్లు, ఎల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఆలీనగర్ ఉర్దూ పాఠశాలలో...

తాడేపల్లిరూరల్: మాజీ రాష్ట్రపతి స్వర్గీయ ఏపీజే అబ్దుల్ కలాంను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని దుగ్గిరాల ఎంపీడీఓ కుసుమ శ్రీదేవి అన్నారు. ఆదివారం దుగ్గిరాల ఆలీనగర్ ఉర్దూ పాఠశాలలో భారత రత్న ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కుసుమ శ్రీదేవి మాట్లాడుతూ పేపర్ బాయ్ నుంచి శాస్త్రవేత్తగా ఎదిగి భారతదేశానికి ఎన్నో సేవలు అందించి, దేశ రాష్ట్రపతిగా అబ్దుల్ కలాం పనిచేశారని అన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



ఆనాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

తెనాలిటౌన్: పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఉత్సాహంగా సాగింది. రూరల్ మండలం అంగలకుదురులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. పాఠశాలలో 1986-87 బ్యాచ్ విద్యార్థుల హాజరయ్యారు. తమకు విద్యను బోధించిన గురువులు కె.వెంకటప్పారావు, ఎస్.వీరాస్వామి, హరిప్రసాద్, పరంధామయ్య, ధర్మమేశ్వరి, హేమలతలతో పాటు ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.అనూరాధను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. తాము చదువుకున్న స్కూల్ అభివృద్ధికి పాటుపడాలనే లక్ష్యంతో స్కూల్‌లో విద్యార్థులకు సైకిల్ స్టాండ్ నిర్మాణానికి రూ.మూడు లక్షలు విరాళాన్ని ప్రధానోపాధ్యాయురాలికి అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సూర్యదేవర వెంకట్రావు, జాలాది వెంకటేశ్వరరావు, కనగాల శ్రీధర్, ఎం.రామయ్య, బి.శ్రీను, ఎ.కల్యాణ చక్రవర్తి, ఆర్.సురేష్, జి.పద్మ, ఎం.రాధిక, తులసీరాణి, శేషశ్రీ, కె.సునీత పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల వితరణ

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని జీవీ మాధవరావు ఆఫీస్ నందు వినుకొండ బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో నిరుపేద బ్రాహ్మణ కుటుంబాలకు చింతలచెర్వు రాఘవేంద్రరావు, మల్లికార్జున శాస్త్రి, గోపాలు ని నరసింహారావు, కె.శివరామారావు, పి. రవికుమార్‌ల సహకారాలతో బియ్యం, చీరెలు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా సుదీర్ఘకాలంగా సహాయసహకారాలు అందిస్తు న్న డి.ఆదిచంద్రశేఖర శాస్త్రి, జి.నాగరాజు, ఎం.మురళీధర్, పి.వర లక్ష్మమ్మలకు మెమోంటో, శాలువాతో సన్మానించారు. కార్య క్రమంలో ఎ.నాగేశ్వరరావు ఎ.వెంకటేశ్వరరావు, పి. సుబ్బారావు, డి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వర్ధమాన నర్తకి తహసీన్‌కు మంత్రి రోజా సత్కారం



తహసీన్‌ను సత్కరిస్తున్న మంత్రి రోజా

తెనాలి: పట్టణానికి చెందిన వర్ధమాన నర్తకి షేక్ తహసీన్ తన నృత్య ప్రదర్శనలతో ప్రముఖుల అభినందనలు అందుకుంది. బాపట్ల జిల్లా కొండుభొట్లవారిపాలెంలో శాసనమండలి చీఫ్ విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు సౌజన్యంతో శనివారం ఏర్పాటుచేసిన పూలవనం కార్యక్రమంలో తహసీన్ కూచిపూడి నృత్యాంశాలను ప్రదర్శించింది. ప్రారంభోత్సవానికి విచ్చేసిన రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి రోజా, డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి, తహసీన్‌ను సత్కరించి అభినందించారు. నేటితరం విద్యార్థులు చదువుతో పాటు కళా, సాంస్కృతిక రంగాలపై అభిరుచిని, అభినివేశాన్ని పెంచుకోవాలని ఈ సందర్భంగా మంత్రి రోజా సూచించారు.

బస్టాండ్‌లో కుప్పకూలిన ప్రయాణికురాలు



తెనాలిరూరల్: వైద్యం కోసం తెనాలి వచ్చిన మహిళ బస్టాండ్‌లో కుప్పకూలి మృతి చెందింది. బాపట్ల జిలా భట్టిప్రోలు మండలం ఐలవరం గ్రామానికి చెందిన ప్రత్తిపాటి లక్ష్మి(50) ఆదివారం తెనాలి ఆర్టీసీ బస్టాండ్‌లో మృతి చెందింది. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె తమ గ్రామం నుంచి తోడికోడలు ప్రసన్న దేవితో కలసి తెనాలి వచ్చింది. పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చూపించుకుంది. తిరిగి మధ్యాహ్నం స్వగ్రామానికి వెళ్లేందుకు ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు కోసం వేచి చూస్తున్నారు. ఇంతలో ఒక్కసారిగా కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందింది. 108 సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి చూసి ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. గుండెపోటుతో మృతి చెందినట్లు భావిస్తున్నారు. ఆస్పత్రిలో చూపించుకునేందుకు తెనాలి వచ్చినట్లు ఆమెతో ఉన్న తోడికోడలు ప్రసన్న దేవి తెలిపారు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు చెప్పారు.